కృష్ణుడి అల్లరి..

గోపికల సందడి

ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సోమవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలో అలంకరించారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అదేవిధంగా పాఠశాలల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాధాకృష్ణుల నృత్యాలు, ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా జరిగాయి.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



షేక్‌పేట్‌లో..



బేగంబజార్‌లో..రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మనిలాల్ షా



కార్వాన్ శ్రీ శివశంకర క్రాంతి సేవా సమితి శ్రీకృష్ణ వేషధారణ పోటీల్లో..



అశోక్‌నగర్‌లో..



జాంబాగ్‌లో..



గోషామహల్‌లో..



గాంధీనగర్‌లో..



ఆసిఫ్‌నగర్‌లో..



ఆస్మాన్‌ఘడ్‌లో..



పటేల్‌నగర్‌లో..



చల్లకుండతో గొల్లభామ



లంగర్‌హౌస్‌లోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో..



వేడుకల్లో రాష్ట్ర బజరంగ్‌సేనా అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు



వేడుకల్లో ఆవుల కృష్ణారావు, ఆవుల అరుణ



షేక్‌పేట్‌లోని నాగార్జున పాఠశాలలో..



అంబికానగర్‌లో..



హనుమాన్‌నగర్‌లో..



గిరికపల్లి కృష్ణ మందిరంలో..



వినాయక మండపాల సమాచారం అందజేయాలి

చార్మినార్: గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా వాటి వివరాలను అందజేయాలని చార్మినార్ ఏసీపీ పి.చంద్రశేఖర్ అన్నారు. చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి చార్మినార్‌లోని మహాదేవ్ మందిరంలో మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకుండా మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని సున్నితమైన ప్రాంతాల్లో స్థానిక పోలీసులతో పాటు అదనపు పోలీసు బలగాలతో పికెట్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ ఎస్సైలు మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలి



వేడుకల్లో పాల్గొన్న పప్పుమాత్రే

అబిడ్స్: ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రేలు పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఆలయాలు అన్యాక్రాంతమవుతున్నా దేవాదాయశాఖ పట్టించుకోవడం లేదన్నారు. సోమవారం కాశిబుగ్గ ఆలయంలో శ్రావణమాస పూజల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున ఆలయాల అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. అన్ని ఆలయాలను దేవాదాయశాఖ అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంజయ్, జగ్‌మోహన్, శంకర్‌సింగ్, సంతోషి, బాబురావు, లడ్డుసింగ్, అనిల్, విజయ్, జోహార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం కార్వాన్, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల నుంచి పలువురు ప్రజలు వచ్చి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తమ బాధలను వారు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. ఆసరా పథకం కోసం దరఖాస్తులు చేసుకొని నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు మంజూరు కాలేదని ఓ వృద్ధుడు ఆయన వద్ద మొరపెట్టుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పింఛన్ వస్తుందని అయితే సాంకేతిక కారణాల వల్ల పలు దరఖాస్తులు తిరస్కరించబడతాయన్నారు. అయితే దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పథకం మంజూరయ్యేలా చూస్తానని ఆయన పేర్కొన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి



డీసీపీ స్నేహ మెహ్రాకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ముఫ్తీ ఖలీల్ అహ్మద్

దూద్‌బౌలి: ఉర్దూ భాషలో విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను బోధిస్తూ ఉర్దూ భాషాభివృద్ధికి జామే నిజామియా ఉర్దూ యూనివర్సిటీ చేస్తున్న కృషి ఎనలేనిదని దక్షిణ మండల డీసీపీ స్నేహ మెహ్రా అన్నారు. సోమవారం సిప్లిగంజ్‌లోని జామే నిజామియా ఉర్దూ యూనివర్సిటీని ఆమె సందర్శించారు. ఆమెకు పవిత్ర ఖురాన్ గ్రంథంతో పాటు వివిధ అంశాలతో కూడిన పలు ఉర్దూ పుస్తకాలను ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యంత పురాతనమైన జామే నిజామియా ఉర్దూ యూనివర్సిటీ ద్వారా విద్యార్థులను ఉర్దూ భాషపై అవగాహన కల్పించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఛాన్సలర్ ముఫ్తీ ఖలీల్ అహ్మద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ ఏసీపీ చంద్రశేఖర్, చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్, హుస్సేనీ ఆలం ఇన్‌స్పెక్టర్ సురేందర్ తదితరులు ఉన్నారు.

మర్రి రాఘవయ్య చిత్రపటానికి క్షీరాభిషేకం



నాంపల్లి: కేంద్ర ప్రభుత్వం కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయడంపై రైల్వే కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే కొత్త పెన్షన్ విధానం స్థానంలో తీసుకువచ్చిన యూపీఎస్ విధానాన్ని స్వాగతించారు. ఎస్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య చేసిన కృషి ఫలించిందని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో హైదరాబాదు రైల్వే స్టేషన్ కోచింగ్ డిపోలో డాక్టర్ మర్రి రాఘవయ్య చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్ఎఫ్ఐఆర్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు వేగి మురళీకృష్ణ నేతృత్వంలో చేసిన కార్యక్రమంలో రైల్వే కార్మికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ హైదరాబాద్ బ్రాంచ్ కార్యదర్శి ఈఎస్.శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రెటరీ వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు, కోశాధికారి నాగరాజ ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షల ముందస్తు సమాచారమేది..?

చార్మినార్: పాతబస్తీలో మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగాయి. దీనికి సంబంధించిన ముందస్తు సమాచారం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. షియా ముస్లింలు అర్బైన్ జులూస్ పేరుతో నిర్వహించిన ర్యాలీ సందర్భంగా ఈ ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగాయి. అయితే ఎటువైపు నుంచి ఎటువైపు రాకపోకలను నిలిపివేస్తున్నారు..? ఎటువైపు అనుమతిస్తున్నారు..? ట్రాఫిక్ దారి మళ్లింపు ఎటువైపు..? ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏమిటీ..? తదితర అంశాలపై సంబంధిత ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి ముందస్తు సమాచారం అందజేయలేదు. దీంతో వాహనదారులు యధావిధిగా తమ తమ ప్రాంతాలకు చేరుకోవడానికి స్థానికంగా పలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. షియా ముస్లింల ర్యాలీ సందర్భంగా ఒకటి రెండు రోజుల ముందుగా సంబంధిత ట్రాఫిక్ ఆంక్షలు మీడియాకు అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి మాత్రం ఎలాంటి ముందస్తు సమాచారాన్ని పత్రికలకు అందజేయకపోవడంతో పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది.

ఏడు గంటల పాటు..

మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు..అంటే దాదాపు 7 గంటల పాటు వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. అటు ఎతేబార్ చౌక్ నుంచి దారుషిఫా చౌరస్తా వరకు.. ఇటు డబీర్‌పురా దర్వాజా వరకు షియా ముస్లింల ర్యాలీ కొనసాగింది.

నట్రాజ్‌నగర్‌లో చోరీ

విజయనగర్‌కాలనీ: డిన్నర్ చేసేందుకు బయటకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన సోమవారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాములు తెలిపిన వివరాల ప్రకారం..నట్రాజ్‌నగర్‌లో నల్మాన్‌ఖాన్ తన కుటుంబంతో ఉంటున్నాడు. ఈ నెల 25న రాత్రి 8.30 గంటలకు ఇంటికి తాళం పెట్టి బయటకు వెళ్లి డిన్నర్ చేసి రాత్రి 10 గంటలకు వచ్చారు. ఇంటికి వచ్చేసరికి వేసిన తాళం పగలగొట్టి ఉండడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు రూమ్ లోపల బీరువా తెరిచి ఉండడాన్ని గమనించారు. బీరువాలో దాచుకున్న రూ.4 లక్షల నగదుతో పాటు 5 తులాల బంగారు ఆభరణాలు, ఒక సెల్‌ఫోన్ దొంగతనం అయినట్లు గమనించారు. వెంటనే బాధితులు టప్పాచబుత్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లిఫ్ట్ గుంతలో పడి వృద్ధుడి మృతి

విజయనగర్‌కాలనీ: లిఫ్ట్ గుంతలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఎస్ఐ. హైమా తెలిపిన వివరాల ప్రకారం..గుడిమల్కాపూర్ ప్రియాకాలనీలోని వకార్ అపార్ట్‌మెంట్ 4వ అంతస్తులో విశ్రాంత ఫార్మసిస్ట్ ఎంఎస్ సమిఉల్లాబేగ్(65) కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఈనెల 17న కంటిశుక్లాల శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులంతా బయటకు వెళ్లగా ఆయన, భార్య ఇంట్లోనే ఉన్నారు. రాత్రి సమయంలో కిందకు వెళ్లేకుందుకు లిఫ్ట్ వద్దకు వచ్చారు. డోర్ ఓపెన్ చేసి లిఫ్ట్‌లోకి కాలు పెట్టాడు. డోర్ ఓపెన్ అయ్యింది. కానీ ఆ సమయంలో 4వ అంతస్తులో లిఫ్ట్ లేదు. దీంతో అతను లిఫ్ట్‌లో అడుగు పెట్టగానే కింది అంతస్తులో ఉన్న లిఫ్ట్ భాగంపై పడ్డాడు. తీవ్ర గాయాలైన బాధితుడిని వైద్య చికిత్సల నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కలియుగ భగీరథుడు సీఎం రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న మెట్టు సాయికుమార్

అబిడ్స్: లక్షలాది మత్స్యకార కుటుంబాలకు అండగా నిలుస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి కలియుగ భగీరథుడని రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా చెరువులను కాపాడుతున్న ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..చెరువులను అక్రమంగా కబ్జా చేసినవారిపై ముఖ్యమంత్రికి లక్షలాదిమంది మత్స్యకారుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. గత పదేళ్ల మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఇతర పార్టీల నాయకులు అడ్డగోలుగా జీహెచ్ఎంసీతో పాటు రాష్ట్ర నలుమూలలా చెరువులను కబ్జా చేశారని ఆయన ఆరోపించారు. చెరువులను కబ్జా చేయడంతో లక్షలాది మంది మత్స్యకార కుటుంబాలకు నష్టం జరుగుతుందని మెట్టు సాయికుమార్ ఆరోపించారు. హైడ్రా ద్వారా చెరువులను కబ్జాచేసే కబ్జాదారులకు చుక్కలు చూపిస్తుండడంతో లక్షలాది మంది ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డిని మెచ్చుకుంటున్నారన్నారు.

కృష్ణస్వామి ముదిరాజ్ జీవితం స్ఫూర్తిదాయకం



రాంపుర ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో..



నివాళులర్పిస్తున్న బండ ప్రకాష్ ముదిరాజ్

సుల్తాన్‌బజార్: బహుముఖ ప్రజ్ఞాశాలి హైదరాబాద్ నగర తొలి మేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జీవితం స్ఫూర్తిదాయకమని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. కృష్ణస్వామి 131వ జయంతి సందర్భంగా సోమవారం హైదర్‌గూడ, ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో కృష్ణస్వామి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాసభ అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నీల రాములు, యువత రాష్ట్ర అధ్యక్షుడు బల్ల సత్తయ్య, ఉపాధ్యక్షులు యాదగిరి, రవికాంత్, కనకయ్య, నాయకులు బొక్కా శ్రీనివాస్ ముదిరాజ్, కృష్ణసాగర్, పోకల రవి, నర్సింగ్‌రావు, సాంబమూర్తి పాల్గొన్నారు.

కృష్ణస్వామి ముదిరాజ్ సేవలు చిరస్మరణీయం

జియాగూడ: కృష్ణస్వామి ముదిరాజ్ సేవలు చిరస్మరణీయమని రాంపుర ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు టి.వేణు ముదిరాజ్ అన్నారు. సోమవారం రాంపురలోని ఆయన 131వ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్.కిరణ్ ముదిరాజ్, పి.నరేష్ ముదిరాజ్, ప్రవీణ్ ముదిరాజ్, ప్రశాంత్ ముదిరాజ్, సంతోష్, ముదిరాజ్, రమేష్, రామేశ్వర్, నర్సింహ, సాయి, నిఖిల్, కల్యాణ్, మణికంఠ ముదిరాజ్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

జియాగూడ: టాస్క్‌ఫోర్స్ సౌత్ వెస్ట్ టీం, మంగళ్‌హాట్ పోలీసులు సంయుక్తంగా ధూల్‌పేట్, ఆరాంఘర్ కాలనీలో దాడులను టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర నేతృత్వంలో నిర్వహించినట్లు సౌత్‌వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్. బాలస్వామి సోమవారం తెలిపారు. ఈ దాడుల్లో ధూల్‌పేటకు చెందిన మహేందర్ సింగ్(26), ఒడిస్సాకు చెందిన భారత్ అలియానా(52), పద్మ తులా అలియానా(45), మంగళ్‌హాట్‌కు చెందిన సుమన్ బాయ్ (35), కాటేదాన్ దుర్గానగర్‌కు చెందిన అమర్‌సింగ్(28)లు ఉన్నారు. అంతర్రాష్ట్ర నిందితులైన భరత్ అలియానా, పద్మ తులా అలియానా గతంలో దంపతులు, వీరు ఖమ్మం 1టౌన్‌లో 32 కేజీల గంజాయి కేసులో పట్టుబడ్డారు. కాగా ధూల్‌పేటకు చెందిన మహేందర్‌కు తన స్నేహితుడి ద్వారా పరిచయం అయ్యింది. మహేందర్ తన వదిన సుమన్, బావా భరత్, అమర్‌సింగ్‌ను కూడా కలుపుకొని హైదరాబాద్‌లో గంజాయిని భరత్, పద్మల నుంచి ధూల్‌పేటలోని మహేదర్ ఇంటికి గంజాయి తెచ్చారు. టాస్క్‌ఫోర్స్ నిర్వహించిన దాడుల్లో 10 కేజీల గంజాయి, 6 సెల్‌ఫోన్లు, రూ.3 వేల నగదు. మొత్తం రూ.3.10 లక్షల విలువచేసింది పట్టుకున్నారు.